

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : యోగిత

బోథ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఇన్‌స్ట్రక్టర్ మునిగల యోగిత పేర్కొన్నారు బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు యోగాపై ఆమె అవగాహన కలిగించారు. వివిధ యోగాసనాలు వేస్తూ విద్యార్థులకు ఆసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు. యోగా వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని, చదువుల్లో రాణించేందుకు ముఖ్యంగా ఏకాగ్రతకు ఉపయోగపడుతుందన్నారు. ఇందులో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.పోశెట్టితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర క్రీడల శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ నగేష్

క్రీడల అభివృద్ధికి తోడ్పాటు అందించండి

● ఎంపీ గోడం నగేష్

బోథ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ జి.నగేష్ కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం ఆయన కేంద్ర మంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ఆదిలాబాద్‌లో హాకీ కోర్టుకు సింథటిక్ టర్ఫ్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు.



జిల్లాకేంద్రంపై కమ్ముకున్న పొగమంచు

తగ్గని చలి తీవ్రత

● బేలలో 6.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు ● చలితీవ్రతతో పాఠశాలల సమయం మార్పు

వివరాలు 6వ పేజీలో...

ఏజెన్సీలో మద్యం అమ్మకాల జోరు

» జిల్లాలో పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్న లిక్కర్ వ్యాపారులు
» నిబంధనలకు విరుద్ధంగా అధికారుల పరోక్ష సహకారం
» విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటు
» గుట్టుగా సాగుతున్న మత్తు దందా
» మామూలుగానే తీసుకుంటున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



● ఇచ్చోడ మండల కేంద్రంలో అక్రమంగా బెల్టు షాపును ఏర్పాటు చేసిన బస్టాండ్ పరిసర ప్రాంతం



● ఇచ్చోడలో ఓ కిరాణా షాపులో మద్యం అమ్మకాలు ఇలా..)

ఆదిలాబాద్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో యథేచ్ఛగా మద్యం అమ్మకాల జోరు కనిపిస్తోంది. ఎలాంటి మత్తుపదార్థాలను విక్రయించరాదన్న నిబంధనలు ఉన్నా.. లిక్కర్ వ్యాపారులకు పట్టింపు లేకుండా పోతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికే మద్యం దుకాణాలను మైదాన ప్రాంతానికి తరలించామని అధికారులు చెబుతున్నా.. ఏజెన్సీలోనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గాదిగూడ, నార్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ మండలాల్లోని ఏజెన్సీ పరిధిలో మద్యం అక్రమ అమ్మకాలు జరుపుతున్నా.. సంబంధిత అధికారులు సైలెంట్‌గా పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డుల్లోనే ఏజెన్సీ నుంచి మద్యం దుకాణాలను తరలించినట్లు ప్రభుత్వానికి చూపుతున్నా.. గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. లిక్కర్ వ్యాపారుల మాయలో పడుతున్న అధికారులు అసలు నిబంధనలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. అధికారుల నిండు నిర్లక్ష్యం, అసమర్థత, అవినీతితో అమాయక గిరిజనులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. మద్యం మత్తులో పడి జనం ఒళ్లు గుళ్ల చేసుకుంటున్నారు. ఎందరో మంది అమాయక గిరిజనులు అనారోగ్య భారీన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పేరుకే ఏజెన్సీ అయినా.. అంతా నాన్ ఏజెన్సీ దందాలే కొనసాగుతున్నాయి. ఇదంతా కళ్లముందే కనిపిస్తున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివాసీ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్ట్ దందా

ఏజెన్సీలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేస్తూ- మద్యం విక్రయాలను జరుపుతున్నారు. నిబంధనల పేరిట ఏజెన్సీ నుంచి మద్యం షాపులను ఎత్తివేసినా.. కొందరు వ్యాపారులు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ మండలాల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలను నాన్ ఏజెన్సీ ప్రాంతానికి తరలించినా.. అమ్మకాలు మాత్రం ఏజెన్సీలోనే కొనసాగుతున్నాయి. ప్రధానం గా ఇచ్చోడ మండల కేంద్రంలో విచ్చలవిడిగా మద్యం అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయి. చిరు వ్యాపారులు, కిరాణషాపు, పలువురు ఇళ్లలోనే మద్యం విక్రయాలను జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తూ దండుకుంటున్నారు. అలాగే ఉట్నూర్, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, సిరికొండ, నార్నూర్ మండలాల్లోనూ ఇదేతంతు కనిపిస్తోంది. ఇంత జరుగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మద్యం అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. టార్గెట్‌ల పేరిట అధికారులే పరోక్షంగా బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలను ప్రోత్స హిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు కఠినంగా వ్యవహరిస్తే ఏజెన్సీ పరిధిలో మద్యం అక్రమ అమ్మకాలు ఎలా జరుగుతాయో? వారికే తెలియాలి మరి..!!

ఏజెన్సీలో మద్యం విక్రయాలు జరపరాదు

: జుల్ఫికర్ అహ్మద్, ఎక్సైజ్ సీఐ, ఇచ్చోడ ఎక్సైజ్ సర్కిల్

ఏజెన్సీ పరిధిలో మద్యం విక్రయాలు జరపరాదు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల సహకారంతో అక్రమ మద్యం విక్రయాలను కట్టడి చేస్తాం. మద్యం వ్యాపారులు అక్రమంగా ఏజెన్సీలో మద్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సరైన సిబ్బంది లేకపోవడం వల్లనే కొంత ఇబ్బందిగా మారింది. త్వరలోనే క్షేత్ర స్థాయి లో దాడులు నిర్వహించి.. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తాం.

నిబంధనలు గాలికి..

ఏజెన్సీ ప్రాంతంలో మద్యం షాపులను ఏర్పాటు చేయరాదనే నిబంధన ఉన్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులకు పట్టింపు లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి. పెసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఏజెన్సీలో ప్రభుత్వం మద్యం దుకాణాలను ఎత్తి వేసింది. కానీ అనాధికారికంగా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారుల అండదండలతో కొందరు

(తరువాయి 6వ పేజీలో...)



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

'చలో రాజ్‌భవన్'లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడంలో ప్రధాన భక్షమికను పోషిస్తున్న బడ ఆర్థికవేత్త ఆదాని, ఆర్థిక అవకతవకలు, మణిపూర్ హింసాత్మక ఘటనల పై దేశ ప్రధాని నరేంద్రమోదీ మౌనం వహించడం పట్ల, ఆదానిని అరెస్టు చేయక పోవడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన చలోరాజ్‌భవన్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ పాల్గొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డు నుంచి రాజ్‌భవన్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్ భవన్ ర్యాలీలో ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ వద్ద చేపట్టిన నిరసనలో రోడ్డు పై భైఠాయించారు. ఆదానిని అరెస్టు చేయాలని, మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్

బోథ్ సమస్యలు పరిష్కరించండి

● సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే అనిల్

బోథ్/నేరడిగొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లరు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, నూతన ఫైర్ స్టేషన్ మంజూరి చేయడంతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినట్లయితే పేద పిల్లలకు న్యాయం జరుగుతుందని వివరించారు. కుప్టి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని, పిప్పల్‌కోటి ప్రాజెక్టు భూనిర్వాసితులకు పరిహారం అందించి పనులు ప్రారంభించాలని కోరారు. ఇచ్చోడలో నూతన పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని బరంపూర్-మూర్ఖండి రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు ఇప్పించాలని కోరారు. సిరి చల్మ నుండి వరకు అటవీ అనుమతులు ఇప్పించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. పురాతన దేవాలయమైన సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయించాలని కోరారు. అలాగే బరంపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయానికి నిధులు కేటాయించాలని, దేగామా గ్రామ వోఆర్ఆర్ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని విన్నవించారు. గిరిజన ఇతరులు పోడు భూములు సాగు చేసుకుని జీవిస్తున్నారని వారికి అటవీ శాఖ నుంచి పోడు పట్టాలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆర్థిక నేరాల నియంత్రణకు కృషి చేయాలి

● నేరాల కట్టడిలో నిరంతర గస్తీ నిర్వహిస్తూ ఉండాలి ● గ్రామ, వార్డు పోలీసు వ్యవస్థను పటిష్టం చేయాలి
● మావల పోలీస్ స్టేషన్ తనిఖీలో జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ● స్టేషన్‌లో రికార్డులు, సిబ్బంది పనితీరు, పరిసరాల పరిశీలన

మావల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఉదయం స్థానిక మావల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొదటగా పోలీస్ స్టేషన్ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐ కె ఫణిందర్, మావల ఎస్‌హెచ్‌వో వి.విష్ణువర్ధన్, జిల్లా ఎస్పీకి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఎస్పీ చేతుల మీదుగా ఒక మొక్కని నాటడం జరిగింది. స్టేషన్ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన డ్రిల్‌ను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అదే విధంగా స్టేషన్ ఆవరణను, పరిసరాలను పరిశీలించి స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి ప్రతిరోజు పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి రిసెప్షన్, సాంకేతిక నిపుణుల పనితీరు, ఉమెన్ హెల్ప్ డెస్క్ సిబ్బంది వేచి ఉండు గది, స్టోర్ రూమ్, రికార్డు రూమ్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. స్టేషన్లో ఇప్పటివరకు నమోదైన సైబర్ క్రైమ్ బాధితుల వివరాలు, సీఈఐఆర్ ద్వారా తిరిగి అందించడం మొబైల్ ఫోన్ల వివరాలు, ఫింగర్ ప్రింట్, డ్రంక్ అండ్ డ్రైవ్ సిబ్బంది యొక్క అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే కిట్లు, కేసు హిస్టరీ సీట్లు, రౌడీ షీట్లు, వీయస్, రికార్డుల నిర్వహణ, డయల్ 100, పెట్రోకార్, బ్లూ కోర్ట్ రౌడీ షీట్లు తదితరాలపై పూర్తి విచారణ చేపట్టారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు.

అంతేకాకుండా, దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటిని అరికట్టాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా ఖచ్చితమైన నిఘా వ్యవస్థను అభివృద్ధి చేసుకొని ఉండాలని సూచించారు. సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించినప్పుడు ఎలాంటి నేరాలు జరగకుండా, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్‌హెచ్‌వో వి.విష్ణువర్ధన్, ఎస్సై పవర్ గౌతమ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం



నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వెంకట్‌రావు

వైభవంగా నాగోబా ఆలయ వార్షికోత్సవం

ఇంద్రవెల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయ తృతీయ వార్షికోత్సవ వైభవంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిభింబించే విధంగా తెల్ల దుస్తులను ధ రించి నాగోబా ఆలయానికి తరలి వచ్చారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్ సమక్షంలో కోడప వినాయక్ మహరాజ్ ఆధ్వర్యంలో నాగోబా ఆలయంలో ఆదివాసీ గిరిజన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు చిన్నుపటేల్, మెస్రం దేవ్‌రావు, మెస్రం శేఖర్ బాబు, మెస్రం దాదారావు, మెస్రం కోసేరావు, మెస్రం జంగు, మెస్రం నాగ్‌నాథ్, మెస్రం తుకారం, మెస్రం ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీరోజు వాకింగ్ చేయాలి : రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య కారణంగా అనేక దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయని వాటి నుంచి రక్షణ పొందేల ప్రతి రోజు ఉదయం సాయంత్రం వాకింగ్ చేస్తే ఉంటారని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. బుధవారం హెల్పేజ్ ఇండియా సహకారంతో వయోవద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో రిమ్స్‌లో వయోవద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏసీడీపీవో మిల్కా, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, వైద్యులు కస్తూరి శ్రీనివాస్, సందీప్ జాదవ్, ఓం ప్రకాష్, విజయ్ మోహన్, వయో వృద్ధుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

టెక్నీషియన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మావల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులు హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ తార్నాకలోని టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకై ఐటీఐలో ఎలక్ట్రీషియన్, పిట్టర్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (కెమికల్ ప్లాంట్), మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, మెకానిక్ మోటార్ వెహికల్ మరియు డ్రాఫ్ట్స్‌మెన్, సివిల్‌లో పాస్ అయిన విద్యార్థులు మాత్రమే అర్హత కలిగి ఉంటారన్నారు. ఈ నెల 26వ తేదీ లోగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కొరకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆదిలాబాద్ అప్రెంటిస్ సెక్షన్ సెల్ నెం. 986643505లో సంప్రదించగలరని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



దుర్వగూడలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న పీడీ సాయన్న



ధనూర్ గ్రామంలో ఇందిరమ్మ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన పీడీ సాయన్న

ఇంద్రవెల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో పీడీ సాయన్న సూచించారు. బుధవారం మండలంలోని మెండపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుర్వగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం మర్కగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని నవగూడ గ్రామ సమీపంలో చెక్ డ్యామ్ నిర్మాణ స్థల పరిశీలన చేశారు. ఇందులో ఉపాధి హామీ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్లు జైస్వాల్, సంతోష్ లాల్, జాధవ్ విఠల్, తదితరులున్నారు.

● తలమడుగులో కొనసాగుతున్న ఇళ్ల సర్వే

తలమడుగు(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించేందుకు పకడ్బందీగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే మండలంలో కొనసాగుతుంది. సోమవారం నుంచి ప్రారంభమైన సర్వే ఇప్పటివరకు మండలంలో 15 శాతం వరకు సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సర్వేకు ఇంటర్నెట్ సిగ్నల్ సక్రమంగా లేకపోవడంతో సర్వే పనులు కొంత నతనడక సాగుతున్నాయి. పనిలో పనిగా పంచాయతీ అధికారులు ఇంటి పన్ను కూడా వసూలు చేస్తున్నారు. ఇంటి పన్ను చెల్లిస్తేనే సర్వే నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రతీ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిర్వహిస్తున్నామని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.

● 'ప్రజాపాలన'లో ఇళ్ల కోసం దరఖాస్తులు

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీలో ప్రజాపాలన ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లను పరిశీలించారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ, ఇందిరమ్మ కమిటీ కాంగ్రెస్ పార్టీ సభ్యులు దూట రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాధాబాయి, అన్నపూర్ణ, కౌసల్య, కె.రాజామని, జయ, అన్నపూర్ణ, దేవానందం, రాజగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● గ్రామాలో ప్రారంభమైన ఇందిరమ్మ సర్వే

బోథ్(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకి సర్వే ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీషతో పాటు కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా కార్యదర్శి హెల్మ వినయ్‌రెడ్డితో పాటు ఎంపీవో వాజిద్‌లు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశువుల చంటి మాట్లాడుతూ సర్వే బృందాలకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు అవుతున్నాయని, ఐటీడీఏ తరఫున మరో 2005లో మంజూరు వచ్చే అవకాశం ఉందని ఆయన ఈ సందర్భగా పేర్కొన్నారు.



యాప్‌లో ఫొటో, వివరాలు నమోదు చేస్తున్న జిల్లా కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆకస్మిక తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాకేంద్రంలోని నెంబర్.44, 49లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి నమోదు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్న అర్జీదారుల వివరాలను సేకరిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలని, రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సివిఎస్ రాజు, సర్వేయర్లు ఉన్నారు.

విద్యార్థులు బయోసైన్స్‌పై మక్కువ చూపాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బయోసైన్స్ సబ్జెక్టుపై మక్కువ పెంచాలని డీఈవో ప్రణీత అన్నారు. తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను అందించారు. దీనికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేస్తూ రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మేము చదువుకునే సమయంలో బయోసైన్స్‌లో కేవలం పటాలు వేసే వారమని తెలిపారు. కానీ ప్రస్తుతం ప్రయోగాత్మకంగా తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారన్నారు. ఇందులో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి రఘు రమణ, ఆదిలాబాద్ రూరల్, అర్బన్ ఎంఈవోలు కంటే నర్సయ్య, సోమయ్య, బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రఘువేందర్, ప్రధాన కార్యదర్శి పొచ్చారెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, టీబీఎస్‌టీ రాష్ట్ర బాధ్యులు బెజ్జంకి రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల పేరిట ఇబ్బందులు : తుడుందెబ్బ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణులకు వేటారని అమాయక గిరిజనులను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు గోడం గణేష్ అన్నారు. బుధవారం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అటవీ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని కార్యాలయంలోనికి వెళ్లకుండా గేట్లను మూసి వేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన మేకల కాపరి మడావి రామకృష్ణని ఇబ్బందులు పెట్టారన్నారు. కాగా, ఈ ఘటనపై ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ వివరణ మేరకు.. సిరికొండ గ్రామానికి మేకల కాపరి నీలుగాయని వేటాడాడని తమకు అజ్ఞాత వ్యక్తి సమాచారం ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే రామకృష్ణని విచారణ నిమిత్తం తీసుకువచ్చామన్నారు. విచారణలో జగన్నాథ్ అనే వ్యక్తి స్టేట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు. విచారణ సమయంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఆందోళనలు చేయడం సరికాదన్నారు. బలవంతంగా ఎవరిపై కూడా కేసులు నమోదు చేయమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

'కేంద్ర హోం మంత్రి క్షమాపణలు చెప్పాలి'

ఇంద్రవెల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్ డిమాండ్ చేశారు. రాజ్యసభలో అంబేద్కర్‌ను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆదిలాబాద్‌లో తగ్గని చలి తీవ్రత

● బేల మండలంలో 6.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు ● చలి తీవ్రతతో పాఠశాలల సమయంలో మార్పులు



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంపై కమ్ముకున్న దట్టమైన పొగమంచు



చలి మంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్న ప్రజలు

ఆదిలాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత మరింతగా పెరిగిపోవడంతో జనం గజగజ వణికి పోతున్నారు. రాత్రి పగలు చలి తీవ్రతనే కనిపిస్తుంది. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 28.5 కాగా, కనిష్ఠంగా 6.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేల మండలంలో కనిష్ఠంగా 6.0 డిగ్రీలు, భీంపూర్‌లో 6.3, మావలలో 6.8, బోథ్‌లో 7.0, ఆదిలాబాద్ రూరల్ 8.0, ఆదిలాబాద్ అర్బన్ 9.1, ఉట్నూర్‌లో 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా అంతటా 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రతతో ఉదయం 10గంటల వరకు జనం బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అంతేగాకుంగా సాయంత్రం నాలుగ గంటలకే పనులు ముగించుకుని రైతులు, వ్యవసాయ కూలీలు ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు. తీవ్రమైన చలితో విద్యార్థులు బడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా గురువారం నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమయాన్ని మార్చుతు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9.40 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పాఠశాలల సమయాన్ని నిర్ణయించారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులతో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. చలి తీవ్రత తగ్గేంత వరకు పాఠశాలల సమయంలో మార్పు ఉండదని పేర్కొన్నారు. అయితే చలి ప్రభావానికి విద్యార్థుల హాజరు శాతం భారీగా పడిపోతుందని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్టమస్

ఉట్నూర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్, యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సపోజ్ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్‌లోని తిరుమల పంక్షన్‌హాల్లో ఏసుక్రీస్తు మాదిరి జయంతి మహోత్సవాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. నిస్సి మినిస్ట్రీస్ పాస్టర్ జయరాజు ఆధ్వర్యంలో ఘనంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డానియల్, జోసెఫ్, ప్రశాంత్‌కుమార్‌లతో పాటు డివిజన్‌లోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి.. అభినందనీయం

ఇచ్చోడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ పట్టణ ప్రజలు గ్రామాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఎంపీడీవో లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ జాదవ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరైవారు ప్రసంగించారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. ఐకమత్యంతో ఇచ్చోడ అభివద్ధికి శ్రీకారం చూట్టడంతో పాటు పాలకులు, అధికారుల సహకారంతో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకుంటామని, ఇచ్చోడ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారించేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ గౌరవ అధ్యక్షుడు అన్నెల లక్ష్మణ్, అధ్యక్షుడు పెరుమాండ్ల నారాయణ, కార్యదర్శి రేణిగుంట సురేష్, గ్రామ పెద్ద కాపు మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచి సునిత, మాజీ ఉపసర్పంచి శీరిష్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

9వ రోజుకు ఉద్యోగుల సమ్మె

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో బుధవారం 9వ రోజు నిరసనలో భాగంగా ధూంధం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, పార్థసారథి, దేవదర్శన్, ప్రకాష్, ప్రియాంక, రాజన్న, శ్రీకాంత్, భోజన్న పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ తనిఖీ

బోథ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ జాదవ్ రామారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో స్టాకు నిల్వలను పరిశీలించారు. అంతేగాక హాస్టల్ విద్యార్థులకు సరఫరా అయిన 16 కిలోల నాసిరకం బియ్యం తిరిగి గోడౌన్‌కు పంపించారు. అంతేగాక పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారమును ఉండాలని వంట పని వారికి సూచించారు ఈ సందర్భంగా ఆయన వెంట హాస్టల్ వార్డెన్ ప్రియ, తదితరులు ఉన్నారు.

'రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేందర్, మారుతి, శ్రీకర్, దీప లక్ష్మి, హరీష్, దత్తాత్రి, తదితరులు పాల్గొన్నారు.

'టీచర్ల సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరవధిక సమ్మెకు పీఆర్టీయూ తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా శాఖ తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ హర్షవర్ధన్ రెడ్డి సహకారంతో రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సహకారంతో వాళ్ల సమస్యలు పరిష్కరించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ సంఘం పక్షాన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కనక అభిమాన్, రాష్ట్ర కార్యదర్శి మోహన్ సింగ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆడె నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షు ు సునీల్ కుమార్, రాథోడ్ రవీందర్ పాల్గొన్నారు.

ఏజెన్సీలో మద్యం అమ్మకాల జోరు

(5వ పేజీ తరువాయి...)

లిక్కర్ వ్యాపారులు అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. అసలు నిబంధనల ప్రకారం ఏజెన్సీలో ఎలాంటి మత్తు పదార్థాల వ్యాపారాలకు అనుమతి లేదు. కానీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మత్తు దందాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఏజెన్సీలో వివాదాలు, ఘర్షణలు మద్యం మత్తులో జరుగుతున్నట్లే తెలుస్తుంది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిపి పెసా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అయినా అధికార యంత్రాంగం చూసీచూడన ట్లు వ్యవహరించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. అలాగే కొందరు లిక్కర్ వ్యాపారులు ఆదివాసీ గిరిజనుల పేరిటా బినామీ వ్యాపారాలు చేస్తూ.. నిబంధనలను గాలికి వదిలేస్తున్నారు. నాన్ ఏజెన్సీలో దుకాణాలను దక్కించుకుంటున్న కొందరు వ్యాపారులు.. గుట్టుచప్పుడు కాకుండా ఏజెన్సీకి మద్యాన్ని సరఫరా చేస్తూ అడ్డగోలుగా దండుకుంటున్నా అడిగే వారే కరువవుతున్నారు.

లిక్కర్ వ్యాపారుల ఎత్తుగడలు

మద్యం అమ్మకాలను పెంచుకునేందుకు లిక్కర్ వ్యాపారులు ఎత్తుగడలు వేస్తున్నారు. ఏజెన్సీని ఆనుకొని ఉన్న మద్యం దుకాణాలను దక్కించుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుపుతున్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకులకు అండదండగా ఉంటూ మద్యం విక్రయాలను జరుపుతున్నారు. అధికారులతో ఇబ్బందులు లేకుండా అంతా తామే చూసుకుంటామంటూ భరోసాను కల్పిస్తున్నారు. లిక్కర్ మాఫియాతో అధికారులు చేతులు కలుపడంతో అంతా అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. అన్నీ తెలిసినా.. నెలవారి మామ్మూళ్లతోనే సరిపెట్టుకుంటున్నారు. ఏజెన్సీ పరిధిలోని హోటళ్లు, దాబా హోటళ్లలో అక్రమంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తూ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అంతే కాకుండా ప్రతీ గల్లీకి బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తూ మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం ఇచ్చోడ మండల కేంద్రంలోనే సుమారుగా 20కి పైగా బెల్ట్‌దుకాణాలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలుస్తూనే ఉంది. కొందరైతే ఏకంగా బెల్ట్ దుకాణం సమీపంలోనే పర్మిట్ రూంలను ఏర్పాటు చేస్తు మద్యం విక్రయాలు జరుపుతున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు.

'నెల రోజుల పని దినాలు కల్పించాలి'

బోథ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు నెలకు 10 దినాలు మాత్రమే పని కల్పిస్తూ.. మిగతా 20 రోజులు పని లేకుండా జీవిస్తున్నారని, కార్మికులందరికీ నెల రోజుల పని దినాలు కల్పించాలని బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవర్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం బీడీ కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ విషయమై బీడీ కార్ఖానాల యాజమాన్యాల వారికి లేఖ రాయడం జరిగిందని పేర్కొన్నారు.

'ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి అన్నారు. బుధవారం ఆర్పీలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్పీల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు ఏడు నెలలుగా పెండింగ్ వేతనాలను విడుదల చేయాలన్నారు. రూ.పది లక్షల ప్రమాద బీమాను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, సంఘం అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు పరిద, కోశాధికారి రేవతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాలిపోయిన పశువుల పాక పరిశీలన

బోథ్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌దరి గ్రామానికి చెందిన కమలాకర్ అనే రైతుకు చెందిన పశువుల పాక ఇటీవల షాక్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో బుధవారం తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఏఈవో రామ్‌లు కలిసి కాలిపోయిన పశువులపాకని పరిశీలించారు. అంతేకాకుండా జరిగిన నష్టంపై అంచనా వేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితుడికి నష్టపరిహారం అందే విధంగా చూడాలని అధికారులను కోరారు.

కుస్తీ పోటీల్లో జిల్లా ప్రథమస్థానం

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌కు ఎన్నికైన నర్సాపూర్(జి) విద్యార్థి



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నర్సాపూర్(జి), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం జరిగిన సీఎం కప్ క్రీడాపోటీలలో నర్సాపూర్ మండలానికి చెందిన జాదవ్ శివానంద్ 50-52 కిలోల విభాగంలో కుస్తీ పోటీలలో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచింది. జాదవ్ సంధ్య 100 మీటర్ల పరుగుపందెంలో జిల్లాలో ప్రథమస్థానం సాధించింది. అదే విధంగా టేబుల్ టెన్నిస్ క్రీడావిభాగంలో నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన అనిరుద్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు దర్శనం దేవేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పరుగు పందెంలో బోరిగాం విద్యార్థి జిల్లా ఫస్ట్



తానూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం నిర్మల్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పరుగుపందెం పోటీల్లో పాఠశాల విద్యార్థి మల్లేష్ మొదటి స్థానంలో నిలిచినట్లు మండలంలోని బోరిగాం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. శంకర్ తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన 15 వందల మీటర్ల పరుగుపందెంలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయిలో మొదటస్థానం సాధించినందుకు గాను విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, భోజారాం, తదితరులున్నారు.

అభివృద్ధి పనుల మంజూరీలో

అసత్య ప్రచారం మానుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి బీజేపీ భైంసా అధ్యక్షుడు మల్లేశ్వర్ హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ భైంసా అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్

భైంసా, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల మంజూరీ ప్రక్రియపై ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి అసత్య ప్రచారం మానుకోవాలని బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ హితవు పలికారు. బుధవారం భైంసాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ గౌతంపింగ్లె, పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి, గాలి రాజన్న, చొప్పరి వెంకటేష్, భీమా శంకర్, బోలిశెట్టి రాజు, హన్మాండ్లు, బందెల నారాయణలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ మంజూరి చేయించుకున్న వచ్చిన వివిధ అభివృద్ధి పనులను తానే మంజూరి చేయించుక వచ్చినట్లుగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ప్రచారం చేసుకోవడం హస్యాస్పదంగా ఉందన్నారు.
భైంసా పట్టణంలోని గణేష్ నగర్ కాలనీ మేదరి కులస్తులకు సంఘ భవనం నిర్మించుకునేందుకు గాను ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ రూ.2.5 లక్షల నిధులు మంజూరి చేయించుక వచ్చారని వివరించారు. అయితే సంబంధిత మంజూరి తానే చేయించుకవచ్చినట్లుగా మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దొడ్డిదారిన తీసుకవచ్చిన ప్రొసిడింగ్ కాపీని మేదరి కులస్తులకు అందించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే ఇకనైనా తన తీరును మార్చుకోవాలని సూచించారు. లేని పక్షంలో ప్రజల చేతిలో మరోమారు గుణపాఠం తప్పదని జోస్యం చెప్పారు.

కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన



బాసరలో కేంద్రీయ విద్యాలయం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

బాసర, డిసెంబరు, 18: (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకోసం బుధవారం రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలిం చారు. రైతు వేదిక సమీపాన సర్వే నెం. 4లో ఐదు ఎకరాల స్థలాన్ని సేకరిం చేందుకు అధికారులు నిర్ణయించారు. ఇది ప్రభుత్వ స్థలం కావడంతో స్థల సేకరణకు అడ్డంకులు తొలగిపోయాయి. మూడేళ్ల క్రిందట బాసరకు కేంద్రీయ విద్యాలయం మంజూరు అయింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా స్థల సేకరణలో జాప్యం జరిగింది. బాసరలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై ఆంధ్రజ్యోతిలో పలుసార్లు కథనాలు ప్రచురితం అయ్యాయి. ఇటీ వలే జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పర్య టన సందర్భంగా ఆంధ్రజ్యోతిలో మరో సారి బాసర సమస్యలపై కథనం వచ్చింది. దీంతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు బుధవారం భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, బాసర తహసీల్దార్ పవన్ చంద్ర స్థలాన్ని పరిశీలించారు.

కడెం రైతాంగానికి యాసంగి పంటకు

సకాలంలో నీటిని విడుదల చేయాలి

● బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ● మూడు మండలాల నాయకులతో కలిసి ప్రాజెక్టు సందర్శన ● నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని అధికారులకు విన్నపం



కడెం ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఖానాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కడెం ఆయకట్టు రైతాంగానికి యాసంగి పంటకు సకాలంలో నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కడెం, దస్తురాబాద్, జన్నారం మూడు మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి కడెం ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నవంబరు నెల ఆఖరిలోనే ఆయకట్టు రైతాంగానికి యాసంగి పంటకు నీటిని విడుదల చేసేందుకు స్పష్టమైన ప్రకటన చేసే ఆనవాయితీ ఉండేదన్నారు. ఈ ఏడాది డిసెంబరు నెల ముగిసేందుకు వస్తున్న ఇప్పటి వరకు ఆయకట్టు రైతాంగంతో అధికారుల బృందం ఎటువంటి సమావేశం నిర్వహించకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. నీటి విడుదలపై ఇంకా స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఈ యాసంగి సాగుకు నీటిని విడుదల చేస్తారా లేదా అని అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆయకట్టు రైతాంగానికి నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని నీటిపారుదల శాఖ ఈఈ రాథోడ్ విఠల్‌కు అందజేశారు. కడెం రైతాంగానికి నీటిని విడుదల చేసేందుకు ప్రాజెక్టుల్లో సరిపడా నీరు లేకపోతే ఎస్సారెస్పీ అధికారులకు సైతం తాము వినతి పత్రాన్ని అందజేసి కడెంకు సరిపడా నీటిని విడుదల చేయాలని కోరుతామని జాన్సన్‌నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కడెం మండలాధ్యక్షులు జీవన్‌రెడ్డి, దస్తురాబాద్ మండల మాజీ వైస్ ఎంపీపీ రాజునాయక్, జన్నారం మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, మల్లారెడ్డి, కానూరి సతీష్, తోట సుమిత్, రఫీక్ బేగ్, జంగం సంతోష్, బొమ్మెన గోపి సహా కడెం, జన్నారం, దస్తురాబాద్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఇమిగ్రేషన్ 1983 చట్ట సవరణ చేయాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇమిగ్రేషన్ 1983 చట్ట సవరణ చేయాలని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర నాయకుడు వి. స్వదేశ్ కోరారు. బుధవారం అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఎం నాయకుడు ఎస్ఎన్ రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... దేశం నుండి పెద్ద ఎత్తున వలస వెళ్లి అభివృద్ధిలో విదేశీ మారకద్రవ్యం ఆర్జించడంలో దేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గల్ఫ్ దేశాల్లో ఆకస్మిక మరణాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవాస భారతీయ బీమా కార్మికులందరికీ వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. తెలంగాణ నుండి 15 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారని తెలిపారు. ఇటీవల జరిగిన సమగ్ర సర్వేలో ప్రభుత్వం గల్ఫ్ వలన వెళ్లిన వారి వివరాలు సేకరించడం హర్షణీయమన్నారు. గల్ఫ్ దేశాల నుండి తిరిగి వచ్చిన వారికి ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరారు. నాయకులు కే. గీత, మోహన్, లావణ్య, లక్ష్మీ, గల్ఫ్ కార్మిక కుటుంబాలు హాజరయ్యాయి.

అర్ధరాత్రి ఆ యువకుల సహాయం..

తల్లి బిడ్డలను కాపాడింది



రక్తదానం చేసిన యువకులు



క్షేమంగా ఉన్న తల్లిబిడ్డలు

నిర్మల్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పురిటి నొప్పులతో వచ్చిన ఓ గర్భిణీకి అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సి వచ్చింది. శస్త్ర చికిత్స చేసి డెలివరీ చేయాలంటే అత్యవసరంగా 'ఓ' నెగెటివ్ రక్తం అవసరం పడింది. స్థానిక బ్లడ్ బ్యాంక్‌లతో పాటు పలుచోట్ల వెతికినప్పటికీ దొరకలేదు. దీంతో పరిస్థితి విషమంగా మారుతున్న సమయంలో సమాచారం తెలుసుకున్న ఇద్దరు యువకులు రక్తదానం చేసి ఆపద్బాంధవులుగా నిలిచారు. మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన నిర్మల్ మాతృ సంరక్షణ ప్రభుత్వ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన దేశెట్టి సునీత అనే గర్భిణీ కాన్పు కోసం వచ్చింది. గ్రామ ఏఎన్ఎం నుస్రత్, ఆశా కార్యకర్త రాజమణిలు గర్భిణీ సునీతకు కావలసిన రక్తం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేదవ్యాస్‌కు సమాచారం ఇచ్చారు. 'ఓ' నెగెటివ్ రక్తం దొరకడం కష్టంగా మారింది. చివరకు గిరిప్రసాద్, ఆదిత్య అనే ఇద్దరు యువకులు అర్ధరాత్రి ఆపద్బాంధువులుగా నిలిచారు. రక్తం ఇచ్చేందుకు ముందుకు రావడంతో ఇద్దరి నుంచి రక్త సేకరణ చేసి గర్భిణీకి సిజేరియన్ చేశారు. వెంటనే ఆ గర్భిణీకి దాతల నుంచి సేకరించిన రక్తం అందించారు. సునీత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆలూర్ గ్రామ వైద్య సిబ్బంది, ఇద్దరు యువకులు కలిసి తల్లిబిడ్డలకు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. వీరిని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ అభినందించారు.

రాష్ట్రస్థాయి బయోసైన్స్ టాలెంట్‌టెస్ట్‌కు సోన్‌విద్యార్థి ఎంపిక

సోన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాకేంద్రంలో తెలంగాణ బయోసైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో సోన్ మండలంలోని జడ్పీఎస్ఎస్ సిద్ధిలకుంటకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం. సంపద ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. త్వరలో హైదరాబాద్‌లో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర బయోసైన్స్ 2024 టాలెంట్ టెస్ట్‌కి ఎంపికైంది. ఎంపికైన ఎం. సంపదను జడ్పీఎస్ఎస్ సిద్ధిలకుంట పీజీ హెచ్ఎం హరీష్‌రెడ్డి, గైడ్ టీచర్ నరేందర్, జడ్పీఎస్ఎస్ సిద్ధిలకుంట పాఠశాల టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

సోన్ మండల బీజేపీ పార్టీ బూత్ కమిటీ ఏర్పాటు

సోన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల బీజేపీ పార్టీ బూత్ కమిటీని బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది. దీనిలో భాగంగా 131 బూత్ అధ్యక్షుడిగా రాజు, సెక్రటరీగా గంగారపు నవీన్, బూత్ లాభార్థి ప్రముఖ్ అడ్వాల రాజ్‌కుమార్, 132లో రంజిత్ అధ్యక్షుడిగా, జనరల్ సెక్రటరీగా శివరాత్రి భీమేష్, 133 బూత్‌లో అధ్యక్షుడిగా ఓరుగంటి వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా బోనగిరి సురేష్, 134 బూత్ అధ్యక్షుడిగా బిజ గణేష్, ప్రధాన కార్యదర్శిగా గుమ్ముల అశోక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, ఎన్నికల పరిశీలకుడు ముత్యపల్లి నరేష్, మామిడాల సంతోష్, దాసరి శ్రీనివాస్, అమృత్, పత్తిరాజు, జక్క రాజేశ్వర్, అన్వేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్‌టిచింగ్ సిబ్బంది నిరసన

కుభీర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని కస్తూర్బ గాంధీ పాఠశాలలో మంళవారం నాన్‌టీచింగ్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. తమకు రూ. 26వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కేజీబీవీ స్కూల్ గేటు ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తుందని, కేవలం రూ. 9750 వేతనాన్ని చెలిస్తుందని,, కనీస జీవోల ప్రకారం కూడా వేతనాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ సెంటర్లు

- వెక్కిరిస్తున్న ఖాళీలు.. తప్పని ఇబ్బందులు
- ఆరునెలల నుంచి అందని అద్దె డబ్బులు
- సగానికి పైగా అద్దె భవనాల్లో సెంటర్లు
- అద్దె భవనాలు 74
- 15 అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఖాళీ

ముథోల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహించాల్సి వస్తుండడంతో టీచర్లకు తిప్పలు తప్పడం లేదు. అంతేకాకుండా 15 అంగన్‌వాడీ టీచర్లు, 74 ఆయా పోస్టులు, ముగ్గురు సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీ ఉన్నాయి. అంతేకాకుండా సీడీపీవో బదిలీ కావడంతో ఇన్‌చార్జి సీడీపీవో విధులు నిర్వహిస్తున్నారు. ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 180 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 37 సొంత అంగన్‌వాడీ భవనాలున్నాయి. 74 కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 0-3 సంవత్సరాల పిల్లలు 5,790 మంది, 3-6 సంవత్సరాలలోపు చిన్నారులు 5,014 మంది, గర్భిణీలు 886 మంది, 1,893 మంది బాలింతలున్నారు.

సగానికి పైగా కేంద్రాలకు సొంత భవనాలు కరువు...

ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ సెంటర్లకు ఏడుగురు సూపర్‌వైజర్ పోస్టులు ఉండాల్సి ఉండగా కేవలం నలుగురు సూపర్‌వైజర్లు ఉన్నారు. మరో ముగ్గురు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీ ఉన్నా యి. అలాగే 180 అంగన్‌వాడీ టీచర్లకుగాను 165 అంగన్‌వాడీ టీచర్లు ఉం డగా 15 అంగన్‌వాడీ టీచర్‌పోస్టులు ఖాళీ ఉన్నాయి. అవి సాలపూర్, బోల్సా, సాత్‌గాం, అబ్దుల్లాపూర్, ఎడ్‌బిడ్, బ్రాహ్మన్‌గాం, పుష్పూర్, నగర్ తండా, మొగిలి, మసల్క తండా, ముథోల్-2, కోలూర్-2 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీ ఉన్నాయి. అలాగే ఆయా పోస్టులు బాసర మండలంలో 09, ముథోల్ మండ లంలో 23, తానూర్ మండలంలో 23, లోకేశ్వరం మండలంలో 19 ఆయా పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఖాళీ పోస్టులు భర్తీచేసి తగుసౌకర్యాలు కల్పించా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. సొంత భవనాలు లేకపోవడం వల్ల విధుల ను సక్రమంగా నిర్వహించడంలో టీచర్లు, ఆయాలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నా విధులు మాత్రం అనేకం ఉంటున్నాయి. అంతేకాకుండా సుమారు 6 నెలల నుంచి అద్దె భవనాలకు సంబంధించిన అద్దె డబ్బులు రావాల్సి ఉం దని దీంతో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా ఆరునెలల నుంచి ఆరు ఏళ్లలోపు వయస్సున్న చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం, మూడు నుంచి ఆరు ఏళ్ల బాల బాలికలను పాఠశాల వైపు ఆకర్షిస్తూ విద్యపై అవగాహన కల్పించడం, చిన్నారులకు రోగ నిరోధక టీకాలు ఇప్పించడం, ఆరోగ్య పరీక్షలు, ఇతర వైద్య సేవలు అందించడం వంటివి నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి తోడు మహి ళల వివరాలు, గర్భిణులు, బాలింతల వివరాలు వారి సంక్షేమ కార్యక్ర మాలను నిర్వహించడం వంటివి చేయాల్సి ఉంటుంది. ఆరోగ్యం, పౌష్టికా హారం ప్రాధాన్యంపై మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. రక్తహీనత, విటమిన్ ఏ లోపం వంటి వ్యాధుల నివారణకు తీసు కోవాల్సిన జాగ్రత్తలు వివరించాల్సి ఉంటుంది. ఇలా చిన్నారులు, మహిళలు, బాలికలు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఆయా కేంద్రాల కార్యకర్తలు తమ విధులను నిర్వహించాల్సి ఉంటోంది. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చాల్సిన అవసరముందని మహిళా సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై ముథోల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో సరోజినిని ఆంధ్రజ్యోతి ఫోన్ ద్వారా వివరణ కోరగా సుమారు 6 నెలల నుంచి అద్దె భవనాలకు సంబంధించిన అద్దె డబ్బులు రావాల్సి ఉన్న మాట వాస్తవమేనన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన వెంటనే చెల్లిస్తాం. ముథోల్ ప్రాజెక్టు నుంచి మండలం నుంచి ఒక సెంటర్ చొప్పున సొంత భవనం కోసం ఉన్నతాధికారులు ప్రపోజల్ పంపమన్నారు. ప్రాజెక్టు నుంచి నాలుగు భవనాలకు సంబంధించిన ప్రపోజల్ పంపాము. ముథోల్ ప్రాజెక్టు పరిధిలో 74 సెంటర్లు అద్దె భవనంలో కొనసా గుతున్నాయి.


అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

కన్నుల పండుగగా అయ్యప్ప పడిపూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

తాంసి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం మధ్యాహ్నం తాంసి గ్రామానికి చెందిన విలాస్ కన్నయ్య స్వామి నిర్వహించిన 18 మెట్ల పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా గణపతికి, తరువాత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి 9 రకాల పదార్థాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం 18 మెట్లు వెలిగించి అయ్యప్ప స్వామికి మంగళ హారతిని ఇచ్చి కార్యక్రమాన్ని ముగించారు. తాంసి గ్రామానికి చెందిన కళాకారులు రాజన్న, గంగా రెడ్డి, కిషన్, పరమేశ్వర్‌రెడ్డిలు పాడిన భక్తిపాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. సతీష్ గురుస్వామి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భిక్షా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు వచ్చిన స్వాములకు తాంబూలాన్ని సమర్పించుకున్నారు.

నేటి నుంచి ధర్మారంలో కోతి దేవుడి జాతర

- తరలిరానున్న భక్తులు
- ధర్మారం గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు


జాతరకు ముస్తాబైన ధర్మారంలోని కోతి దేవుడి ఆలయం

లక్ష్మణచాంద, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారంలో గురువారం నుంచి కోతి దేవుడి జాతర కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం డిసెంబరు 19, 20 తేదీల్లో ఉత్సవాలు నిర్వహిస్తారు. గురువారం రథోత్సవం, శుక్రవారం జాతర నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా సమీప జిల్లాలనుంచి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఆంజనేయుడికి ప్రతిరూపంగా భావించి పూజించే ఈ కోతిదేవుడి జాతరకు వచ్చే వారందరి కోసం ఆలయ కమిటీ అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ నవీన్ కుమార్ సూచనల మేరకు ఎస్సై సుమలత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

కోతి దేవుడి చరిత్ర...

ధర్మారం గ్రామస్తుల కథనం ప్రకారం... 1976 సంవత్సరానికి ముందు సమీప పరిసర ప్రాంతంలో గల ఒక వానరం (కోతి) గ్రామస్తులతో మమేకమై జీవించేది. గ్రామస్తులు కూడా ఈ వానరాన్ని చాలా ఆప్యాయంగా, భక్తి భావంతో చూస్తూ పలు తినుబండారాలు ఇచ్చేవారు. దీంతో గ్రామ ప్రజలతో సన్నిహిత్యం బాగా పెరిగింది. రాను రాను ఈ కోతి చేష్టలు అధికమై గ్రామస్తులకు ఇబ్బందులు తలెత్తాయి. సమీప తోటలలో గల పంటలు పాడు చేయటం, పశువులు, మనుషులపై దాడిచేసి గాయపరచటం వంటి సంఘటనలు జరిగాయి. దీంతో విసుగు చెందిన గ్రామస్తులు ఈ వానరాన్ని చంపి పూడ్చిపెట్టారు. అనంతరం గ్రామంలోని ఒక వ్యక్తికి నిద్రిస్తున్న సమయంలో స్వప్నంలో కనిపించి తాను ఆంజనేయుడి ప్రతి రూపాన్నని తనకు గుడికట్టించాలని చెప్పినట్లు అతను గ్రామస్తులకు తెలిపాడు. దీంతో గ్రామస్తులంతా కలిసి పూడ్చి పెట్టిన చోట ఘోరి కట్టి పూజింపసాగారు. ఆనాటి నుంచి ప్రతి సంవత్సరం ఉత్సవాలు, జాతర నిర్వహిస్తున్నారు.

ఆత్మహత్యల నివారణకు చర్యలు

- జిల్లా ఎస్పీ జానకి షర్మిల


బాసర గోదావరి వంతెన వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ

బాసర, డిసెంబరు, 18 : (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి వంతెన వద్ద ఆత్మహత్యల నివారణ చర్యలు తీసుకుంటామని ఎస్పీ డా.జానకి షర్మిల చెప్పారు. బాసర గోదావరి వంతెన వద్ద వరుస ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వంతెన గోదావరి తీరాన్ని బుధవారం ఎస్పీ పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యల గురించి కింది స్థాయి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంతెన వద్ద ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, ముందస్తు కట్టడి చర్యలు తీసుకుంటామని ఎస్పీ డా.జానకిషర్మిల పేర్కొన్నారు. వంతెనకు ఇరువైపుల ఇనుప కంచెను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై నిరంతరం నదీ తీరంలో పోలీసు నిఘా పెంచుతామని తెలిపారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్ తదితరులున్నారు.

రోడ్డుపైనే స్తంభాలు

- రాకపోకలకు ఇబ్బందులు


రోడ్డుకు మధ్యలో వేసిన స్తంభాలు

తాంసి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఆనుకొని స్తంభాలు వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు. ఇటీవల కప్పర్ల నుంచి జామిడి ఎక్స్‌రోడ్ వరకు కొత్త స్తంభాలను వేశారు. అయితే ఈ స్తంభాలు రోడ్డుకు దగ్గరగానే ఉండడం రెండు వాహనాలు ఎదురు ఎదురుగా వస్తే వెళ్లలేని స్థితిలో ఉన్నాయి. ఈ విషయంపై ఇప్పటివరకూ ఏ ఒక్కరూ స్పందించకపోవడంతో రోడ్డుపైనే స్తంభాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. వాస్తవానికి రోడ్డుకు కొంత దూరంలో స్తంభాలు వేయాల్సి ఉంటుంది. కానీ ప్రణాళికలు లేని పనులతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాహన చోదకులు అంటున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఇది ఒక జామిడి, కప్పర్ల మధ్య సమస్యనే కాదని చాలా చోట్ల ఇలాగే స్తంభాలు రోడ్డుకు అనుకొని ఉన్నాయని అంటున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రహరీ లేక పాట్లు


కూలిపోయిన బాలుర వసతి గృహం ప్రహరీ

బోథ్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం చుట్టూ ఉన్న ప్రహరీ ఓ వైపు కూలిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల పక్కన ఉన్న బీసీ హాస్టల్ కూలిపోవడంతో అందులో ముళ్ల పొదలు, చెట్లుపెరిగాయి. దీంతో వాటిలో పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు ప్రహరీ నిర్మించి పక్కనఉన్న పాత బీసీ హాస్టల్‌లో పెరిగిన చెట్లు, ముళ్ళ పొదలను తొలగించాలని కోరుతున్నారు. రాత్రిపూట బయటకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు.

మూడోరోజుకు చేరిన సీఆర్టీల సమ్మె

ఉట్నూర్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లకు (సీఆర్టీ) ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు టైం స్కేల్ కల్పించాలని కోరుతూ ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ సీఆర్టీల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మెకు ఉమ్మడి జిలాలోని సీఆర్టీలు తరలివచ్చారు. సీఆర్టీల నిరవధిక సమ్మెకు వివిధ ఉపాధ్యాయ సం ఘాల నాయకులు మద్దతు పలికారు. గోడం శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలలు



మూసి ఉన్న పాఠశాలలు

నేరడిగొండ, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడబ్ల్యూపీఎస్‌లో 720 పాఠశాలలు ఉండగా ఈ పాఠశాలలోని సీఆర్టీల అధ్యాపకులు సమ్మెలు నిర్వహిస్తుండడంతో పాఠశాలలు మూతబడ్డాయి. దీంతో విద్యార్థులు పాఠాలకు దూరమవుతున్నారు. సమ్మె ముఖ్య ఉద్దేశం సీఆర్టీలను రెగ్యూలర్ చేయాలి. 5 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి. మినమమ్ టైం స్కేల్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని పలు డిమాండ్‌లతో సమ్మెకు దిగారు. ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు అందించాలి అని నాయకులు మహేం దర్‌జాదవ్ డిమాండ్ చేశారు. అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను కూడా పూర్తి చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ స్యను ముఖ్యమంత్రి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీప్రకారం ట్రైబల్ వెల్ఫేర్ ఎస్సీ వెల్ఫే ర్ బీసీ వెల్ఫేర్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్‌లకు సమాన పనికి సమాన పనికి సమాన వేతనంతో పాటు సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లతో ముఖ్యంగా మహిళ ఉద్యోగులకు ప్రసుతి సెలవులు ప్రకటించాలని గిరిజన లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌జాదవ్ డిమాండ్ చేశారు.





బాసరలో గోదావరి బ్రిడ్జిపై జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వేణు(ఫైల్)

..పూర్ణిమ

ఓదార్చుస్తున్న ఎస్పీ

బాసర గోదావరిపై ఆత్మహత్యల కట్టడి

- బలవన్మరణాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- బ్రిడ్జికి ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు
- సీసీ కెమెరాలతో నిఘా
- నిరంతరం బ్లూకోర్టు పోలీసులతో బ్రిడ్జిపై పెట్రోలింగ్
- పోలీసు స్టేషన్‌కు అనుసంధానం కానున్న సీసీ కెమెరాలు

నిర్మల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత కొంత కాలం నుంచి నిర్మల్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్ర జిల్లాలకు చెందిన పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతూ బాసర గోదావరి బ్రిడ్జికి కళంకం తెస్తుండడాన్ని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సీరియస్‌గా తీసుకున్నారు. పవిత్రమైన గోదావరి నది ఆత్మహత్యలకు అడ్డాగా మారుతుండడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా భవిష్యత్‌లో గోదావరినది ఆత్మహత్యలకు అడ్డాగా ఉండకుండా చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనికి అనుగుణంగా ఎస్పీ నూసైడ్ ఎరాడికేషన్ ఆపరేషన్ పేరిట రూపొందించిన ప్రణాళికపై కసరత్తు మొదలుపెట్టారు. దీనికి అనుగుణంగా బుధవారం బాసర వద్ద గల గోదావరినదిపై బ్రిడ్జిని పరిశీలించారు. ఆ తరువాత అధికారులతో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో బాసర గోదావరి నదిపైనే కాకుండా ఆత్మహత్యలకు అనుకూలంగా ఉన్న గోదావరి ఘాట్ల పరిస్థితులను సమీక్షించారు. ఆత్మహత్యల నివారణకు తీసుకోబోయే చర్యలపై ఆమె భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో పాటు సీఐ, ఎస్‌ఐలతో సుదీర్ఘంగా చర్చించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రకు చెందిన వారు ఇక నుంచి ఆత్మహత్యలకు పాల్పడకుండా అడ్డుకోవాలన్న లక్ష్యంతోనే ఈ ఆపరేషన్‌ను అమలు చేయబోతున్నట్లు ఎస్పీ సంబంధిత అధికారులకు వివరించారు. దీనికి అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణను ఒకటి రెండు రోజుల్లోనే గోదావరి బ్రిడ్జిపై చేపట్టబోతున్నారు. ఇందులో భాగంగానే గోదావరిపై బ్రిడ్జిపై ఇరువైపులా ఏడు అడుగుల పొడవుతో భారీగా ఇనుప తెరలను నిర్మించనున్నారు. అలాగే ఇరువైపులా ఏరియా అంత కవరేజ్ అయ్యేట్లు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సీసీ కెమెరాలను బాసర పోలీసుస్టేషన్‌కు అనుసంధానం చేసి ఈ కెమెరాల ద్వారా గోదావరి బ్రిడ్జిపై దృష్టి సారించనున్నారు. అలాగే ఆత్మహత్యలకు అనుకూలంగా ఉన్న ఘాట్ల వద్ద గజ ఈతగాళ్ళను నియమించనున్నారు. 24/7 పద్ధతిలో గజ ఈతగాళ్లు ఇక్కడ నిరంతరం గోదావరిలోకి దిగే వారి కదలికలను గమనిస్తారు. అలాగే బాసర గోదావరి బ్రిడ్జిపై నిరంతర పెట్రోలింగ్ కోసం మహిళా కానిస్టేబుల్స్‌ను నియమించనున్నారు. నైట్ పెట్రోలింగ్ కోసం అలాగే పికెట్‌డ్యూటీల కోసం సిబ్బందిని కేటాయించనున్నారు. బ్లూకోర్టు పోలీసులు నిరాటకంగా బ్రిడ్జికి రెండు వైపులా తిరుగుతూ వచ్చే వారు పోయే వారిపై నిఘా సారించనున్నారు. దీంతో పాటు గోదావరి బ్రిడ్జి సగభాగం నిజామాబాద్ జిల్లా పరిధిలో ఉన్నందున అక్కడి పోలీసులతో కూడా ప్రస్తుత ఆపరేషన్‌పై సమన్వయం చేయనున్నారు. నిజామాబాద్ పోలీసుల సహకారం తీసుకొని ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భావిస్తున్నారు. ఆత్మహత్యల రహిత గోదావరి బ్రిడ్జిగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యమంటూ ఎస్పీ ప్రకటించారు.

నిఘా నీడలో బ్రిడ్జి..

బాసర గోదావరి బ్రిడ్జి గత కొంతకాలం నుంచి ఆత్మహత్యలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలున్నాయి. నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన చాలా మంది ఇక్కడి గోదావరి నది పై గల బ్రిడ్జిపై నుంచి దూకి బల వన్మరణాలకు పాల్పడుతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు గోదావరి స్నానఘట్టాల వద్ద కూడా తరుచుగా ఆత్మహత్య ఘటనలు వెలుగు చూస్తున్నాయి. దీని కారణంగా చాలా మంది భక్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడి ఆత్మహత్యల తీవ్రత పరిస్థితులు తెలుసుకున్న ఎస్పీ పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆత్మహత్యలను ఎలాగైనా నివారించాలని ఆమె కార్యాచరణ రూపొందించారు. దీనికి అనుగుణంగా బాసర గోదావరి బ్రిడ్జి ఇక నిరంతరం నిఘా నీడలోనే ఉండబోతోంది. బ్రిడ్జిపై ఏర్పాటు చేయనున్న సీసీ కెమెరాల ద్వారా వాహనదారులు అలాగే ఆత్మహత్యలకు పాల్పడే అనుమానితుల కదలికలను పసిగట్టనున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు బాసర పోలీసుస్టేషన్‌కు అనుసంధానం కాబోతున్నందున అక్కడ ఎప్పటికప్పుడు పోలీసుసిబ్బంది పరిస్థితులను గమనించే అవకాశం ఉంటుంది. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినా గానీ, నిలబడ్డ గానీ వెంటనే ఇక్కడి పోలీసులకు సీసీ కెమెరాల ద్వారా తెలిసిపోనుంది. దీంతో పోలీస్ స్టేషన్ నుంచి బ్లూ కోర్టు సిబ్బందికి సమాచారం అందించి వెంటనే అక్కడి వారిని ఆదుపులోకి తీసుకోనున్నారు. దీని కారణంగా ఆత్మహత్యలను అడ్డుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. అలాగే బ్రిడ్జికి ఇరువైపులా ఏడు అడుగుల పొడవుతో ఏర్పాటు చేసే జాలీల కారణంగా ఎవరు కూడా బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకే అవకాశం ఉండదని అంటున్నారు. 24/7 పద్ధతిలో బ్రిడ్జిపై ఇక నిరాటకంగా నిఘా కొనసాగబోతోంది.

ఆత్మహత్యల కట్టడిపై ఎస్పీ దృష్టి

ఇప్పటికే జిల్లా ఎస్పీ డా.జానకీషర్మిల సామాజిక రుగ్మతలు, సేవా కార్యక్రమాలు అలాగే యువతను మద్యం మత్తుకు దూరంగా ఉంచడం లాంటి వాటిపై అనేక కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఎస్పీ ఇటీవలే తాజాగా బాసర ట్రిపుల్ ఐటీని కూడా దత్తత తీసుకున్నారు. అయితే బాసర గోదావరిపై తరుచుగా జరుగుతున్న ఆత్మహత్యల విషయంలో ఆమె చలించిపోయారు. చాలా మంది తమ కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటుండడం పట్ల ఆమె కలత చెందారు. ఇక నుంచి గోదావరి నదిపై బ్రిడ్జిపై ఆత్మహత్యలను పూర్తిగా నివారించేందుకు ఆమె ప్రయోగాత్మకంగా పలు చర్యలు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగానే బ్రిడ్జిపై జాలీలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇక ఆత్మహత్యల నివారణ బాధ్యతను అక్కడి పోలీసులకు అప్పగించారు. దీంతో పాటు పరిస్థితులను పోలీసులు చేపడుతున్న చర్యలను ఎప్పటికప్పుడు తానూ స్వయంగా పర్యవేక్షిస్తానంటూ కూడా ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే ఈ గోదావరి బ్రిడ్జి నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్ జిల్లాలతో కూడా కలిసి ఉన్న కారణంగా అక్కడి పోలీసు యంత్రాంగంతో కూడా ఎస్పీ సంప్రదింపులు జరుపుతున్నారు. అక్కడి పోలీసుల సహకారం తీసుకొని ప్రస్తుత కార్యాచరణను పూర్తిస్థాయిలో అమలు చేయబోతున్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక సామాజిక సంస్కరణలు చేపడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్న ఎస్పీ గోదావరినది బ్రిడ్జిపై ఆత్మహత్యల నివారణకు ప్రస్తుతం చేపట్టబోతున్న కార్యచరణను కూడా మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

రేపు గోదాదేవి పల్లకీ సేవ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి పల్లకీ సేవ శుక్రవారం 7:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొండా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం జరిగే ధనుర్మాస పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

జిల్లాను బెంబేలెత్తిస్తున్న చలి

- రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మామడ మండలంలో 7.3 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత
- ఆరు మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ

నిర్మల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలను చలి బెంబేలెత్తిస్తోంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు క్షీణించి పోతుండడంతో చలితీవ్రతకు జనం గజ గజ వణుకుతున్నారు. మామడ మండలంలోని తాంద్ర గ్రామంలో అత్యల్పంగా 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పది డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైన మామడ, పెంబి, భైంసా, కుభీర్, కుంటాల, బాసర ఆరు మండలాల్లో అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో 12 డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. చలితీవ్రత జోరుగా ఉన్న నేపథ్యంలో జిల్లా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించిన జడ్పీ మాజీ చైర్మన్ దంపతులు

సోన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వి. శోభారాణి సత్యనారాయణ గౌడ్ దపంతులు బుధవారం సందర్శించారు. ఆలయ గురుస్వామి నర్సారెడ్డిచే హారతి తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... 32 సంవత్సరాల క్రితం చిన్నగా రూపొందిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని పలు జిల్లాలకే ఆదర్శంగా తీర్చిదిద్దారని, నర్సారెడ్డి చేస్తున్న ఆధ్మాతిక పూజలు, ఆలయానికి అంకిత భావంతో చేస్తున్న కృషిని అభినందించి ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది, క్రమశిక్షణగా అయ్యప్ప స్వాముల దీక్షను నిర్వహించడంతో దిన దినం భక్తుల సందడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు బర్మ రాజ నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ భీమేష్, రాములు, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో నిరుపేదలకు బ్లాంకెట్ల పంపిణీ



ఖానాపూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మస్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గంగాపేట్‌లో బుధవారం సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్త బృందం జిల్లా అధ్యక్షులు భీమ్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్‌ల చేతుల మీదుగా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన వృద్ధులకు 40 బ్లాంకెట్లను పంపిణీ చేశారు. సత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని మస్కాపూర్ హైస్కూల్‌లో గతంలో విద్యార్థులకు నిర్వాంచిన వ్యాసరచన పోటీల తాలూకు బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ పోటీల్లో మస్కాపూర్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు, సుర్జాపూర్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరచగా వారికి మెమొంటోలను అందజేశారు.

పకడ్బందీగా 90 రోజుల ప్రణాళికను అమలు చేయాలి

- జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం
- ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఐఈవో పరుశురాం నాయక్

దిలావర్‌పూర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో తొంభై రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం నాయక్ బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు గాను ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అధ్యాపకుల చేత తొంభై రోజుల ప్రణాళిక తయారు చేయించి అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమలుతీరును పర్యవేక్షించిన డీఐఈవో జాదవ్ పరుశురాం నాయక్ అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రతి తరగతిలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. తొంభై రోజుల ప్రణాళిక ప్రకారం కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కళాశాలకు క్రమం తప్పకుండా హాజరైతేనే సబ్జెక్టుపై పట్టు వస్తుందన్నారు. వార్షిక పరీక్షల టైంటేబుల్ వచ్చిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విద్యార్థులు వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం టీచింగ్, నాన్ టీచింగ్ సాఫ్ట్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కమిషనర్ అడిగిన వివరాలను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. తొంభై రోజుల ప్రణాళిక ప్రకారమే తరగతుల నిర్వహణ జరగాలన్నారు. బోర్డు నుంచి అధికారులు వచ్చే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండి అన్ని విషయాలలో సంపూర్ణ సమాచారం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి రోజు ఆన్‌లైన్ టీచింగ్ డైరీని పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, అధ్యాపకులు ఉన్నారు.

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

లక్ష్మణచాంద, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీమా చేయటం వలన మీ కుటుంబానికి ఎంతో ధీమాగా ఉంటుందని డీసీసీబీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రఘునందన్‌రెడ్డి బుధవారం అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లక్ష్మణచాందలో క్రాప్‌లోన్ తీసుకున్న బాబాపూర్ గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ కుటుంబానికి రూ. 2,00,000 బీమా చెక్కును ఆయన అందజేశారు. రుణం తీసుకున్న సమయంలో బీమా చేయటం వల్లనే ఈ బీమా మొత్తం లభించిందన్నారు. ప్రాథమిక సహకార సంఘం రైతులకు అన్ని విధాల అండగా ఉంటుందన్నారు.

సమీకృత సాగుకు జాతీయస్థాయి అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న డీఆర్డీవో ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి

నిర్మల్ అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీఆర్డీవో, ఐకేపీ, సెర్ప్‌ల ఆధ్వర్యంలో నిర్మల్ సమీపంలోని కొండాపూర్ వద్ద నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయక్షేత్రానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఈ వ్యవసాయ క్షేత్రంలో పొదుపు సంఘాల మహిళలు తక్కువ విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తూ ఆకుకూరలు, కూరగాయల పంటల సాగుతో పాటు చేపలు, కోళ్ల పెంపకం లాంటివి చేపడుతున్నారు. వీటి నిర్వహణతో క్రమంగా మహిళలు ఉపాధితో పాటు ఆదాయం కూడా పొందుతున్నారు. ఈ సక్సెస్ స్టోరీని గుర్తించిన ఢిల్లీలోని ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ బెస్ట్ ఉమెన్ ఫెడరేషన్ సంస్థ ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విభాగంలో నిర్మల్ డీఆర్డీవోను రెవల్యూషనరీ ఉమెన్ ఎంపవర్మెంట్ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం న్యూ ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇక్కడి డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు రావడం గర్వకారణమన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



క్రీడలను తిలకిస్తున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు దోహదం చేస్తాయని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టం చేశారు. బుధవారం డిగ్రీ కళాశాలలో మూడో రోజు నిర్వహిస్తున్న క్రీడలను సందర్శించారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతే నన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆరోగ్యకర పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం క్రీడతో సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగే పోటీలు పరిశీలించారు. క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్

అంగన్‌వాడీ కేంద్ర భవనం ప్రారంభం

సోన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పెయింటింగ్ వేసి ఆధునీకరించిన భవనాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, సీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి, మంగళ, ఎంపీవో కలీం, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రముఖులు విద్యార్థులకు స్ఫూర్తినిస్తారు

- బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్ కార్యక్రమంలో ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళిదర్శన్

బాసర, డిసెంబరు, 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో విలువలు, పాత్ర నిర్మాణ సూత్రాలు పెంపొందించే ప్రయత్నంలో బుధవారం ఆర్జీయూకేటీ బాసరలో బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్ అంశంపై కార్యక్రమం జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విజయం సాధించడంలో పాత్ర నిర్మాణం, ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్ మురళిదర్శన్ విద్యారంగంలో, పరిపాలనలో తన అపారమైన అనుభవం నుండి తన విలువైన అంతర్దృష్టులను పంచుకున్నారు. వ్యక్తులు మొత్తం సమాజాన్ని రూపొందించడంలో విలువలు, నైతికత ప్రాముఖ్యతను హైలెట్ చేశారు. బలమైన దిక్సూచిగా తమకు తాము అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఏవో రణధీర్ సాగి, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ అసోసియేట్ డాక్టర్ విట్టల్, కౌన్సిలర్స్ నాగలక్ష్మీ, శ్రీలక్ష్మీ, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పాఠశాల పనివేళలు మార్చండి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చలితీవ్రత దృష్ట్యా పాఠశాలల పనివేళలు మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కోరింది. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గురుకుల, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం బంగల్‌పేట్‌లోని డబుల్ బెడ్ రూమ్ హౌసింగ్ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు తొడసం శంభు అధికారులను కోరారు. బుధవారం కాలనీని సందర్శించారు. మల్లయ్య అనే వ్యక్తి ప్రమాదానికి గురికావడం పట్ల విచారణ వ్యక్తం చేశారు. మురికి కాలువలు, రోడ్లు, చెత్త నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. నిర్మాణాల నాణ్యతపై విచారణ జరుపాలని కోరారు.

వడ్డేపల్లిలో గుడుంబా స్వాధీనం.. కేసు నమోదు



గుడుంబా తయారీదారితో ఎక్సైజ్ అధికారులు

లక్ష్మణచాంద, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై రాత్రి బుధవారం దాడులు నిర్వహించారు. నిషేధిత గుడుంబాను తయారు చేస్తున్న దేవోళ్ల లక్ష్మీ, దేవోళ్ల చిన్నక్కపై కేసు నమోదు చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబాను ఎవరు తయారు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌రావు, హెడ్ కానిస్టేబుల్ నరేందర్, సిబ్బంది నరేష్, గౌతమ్, రవీందర్, తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై మేక మృతి



లక్ష్మణచాంద, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బైరి నడ్పి ముత్తన్నకు చెందిన మేక విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మల్లాపూర్ మాజీ సర్పంచ్ అడిచెర్ల రవి వివరాల ప్రకారం... చామన్‌పెల్లి శివారులో మేత మేస్తుండగా సమీప ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి ఉన్న పచ్చగడ్డి తీగకు తగిలి షాక్‌కు గురై మరణించింది. మృతి చెందిన మేక విలువ 20 వేలు ఉంటుందన్నారు.